సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 7 । ఆగస్టు । 2023



పార్టీలకు అతీతంగా సంక్షేమం

పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమాన్ని ప్రభుత్వం అందిస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. 8లో



వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక

వివిధ పార్టీలకు చెందిన కుటుంబాలు ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ ఉదయ భాస్కర్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. 8లో



విహారంలో ప్రమాదం 8లో

మారేడుమిల్లి ప్రాంతానికి విహారానికి వచ్చిన ఇద్దరు మహిళలు ఊహించని రీతిలో ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు.

ఆపద్బాంధవుడు



ప్రజల కష్టాలను ప్రచారం కోసం వాడుకున్న నేతల్ని చూశాం. అలాంటి పరిస్థితులే వచ్చినపుడు తన రాక వల్ల సహాయక చర్యలకు ఇబ్బంది కలుగుతుందని ఆలోచించిన ముఖ్యమంత్రిని చూడటం ఇదే తొలిసారి. ప్రజల కష్టాన్ని ముందుగానే గుర్తించి, ముందస్తు సహాయక చర్యలు చేపట్టిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని గిరిజనులు గుండెల్లో పెట్టుకున్నారు. నేడు తమను పరామర్శించేందుకు వస్తున్న జననేతకు ఆత్మీయ స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు. సీఎం జగన్ కూనవరం పర్యటనకు అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు.

- ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు సహాయక చర్యలు
- బాధితుల్ని పరామర్శించనున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- నేడు కూనవరం రాక
- కట్టుదిట్టమైన భద్రత

చింతూరు/కూనవరం: గోదావరి, శబరి నదుల వరదలకు విలీన మండలాలు ముంపునకు గురయ్యాయి. నాలుగు మండలాల్లో 177 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకోగా, 26,195 కుటుంబాలు ప్రభావితమయ్యాయి. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. గత ప్రభుత్వాలకంటే భిన్నంగా ముందుగానే వరద ప్రాంతాలకు సహాయ సామగ్రిని చేరవేసి బాధితులకు అందచేసింది. ముంపు తగ్గగానే వరద బాధితులకు రూ.2 వేల చొప్పున తక్షణ ఆర్థికసాయం అందించింది. సహాయక చర్యలకు ఆటంకం కలగకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరద ప్రాంతాల పర్యటనను వాయిదా వేసుకున్నారు. సహాయక చర్యలు ముగింపు దశకు చేరుకోవడంతో బాధితులను స్వయంగా పరామర్శించి వారి కష్టసుఖాలను తెలుసుకునేందుకు ఆయన కూనవరం వస్తున్నారు.

సహాయక చర్యలు ఇలా..

- విలీన మండలాల్లో వరదలు రావచ్చనే సంకేతాలతో అప్రమత్తమైన ప్రభుత్వం ముంపునకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి రేషన్ బియ్యం(బఫర్ స్టాక్) సిద్ధం చేసింది. జూన్, జూలై, ఆగస్టుకు సంబంధించిన రేషన్‌ను వరదలకు ముందుగానే నాలుగు మండలాల్లో పంపిణీ చేశారు.
- ముంపునకు గురయ్యే ప్రాంతాలకు చెందిన గర్భిణులు, బాలింతలు, డయాలసిస్ రోగులను ముందుగానే చింతూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చింతూరు ఐటీడీఏ కార్యాలయంలోనే ఉంటూ సహాయక చర్యలను పర్యవేక్షించారు.
- ఐటీడీఏలో కంట్రోల్ రూం ఏర్పాటుచేసి వరదలపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారు.

సురక్షిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి వరద సహాయక సిబ్బందిని అందుబాటులో ఉంచారు. సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు నాలుగు మండలాల్లో లాంచీలు, మరపడవలను సిద్ధం చేశారు. వరదనీరు గ్రామాలను చుట్టుముడుతున్న తరుణంలో ఆయా గ్రామాల ప్రజలను ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలకు తరలించారు.



ముంపు ప్రాంతంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరం

- పునరావాస కేంద్రాల్లో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు, తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించారు. వరద పెరుగుతున్న తరుణంలో చింతూరు కేంద్రంగా సహాయ కార్యక్రమాలను ముమ్మరం చేశారు. లాంచీలు, పడవలపై నిత్యావసరాలు, కూరగాయలను ముంపు ప్రాంతాలకు పంపించి వరద బాధితులకు పంపిణీ చేశారు.
- వరద తగ్గుముఖం పట్టిన తరువాత ముంపు ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడంతో పాటు వైద్యశిబిరాలు నిర్వహించారు.
- సహాయక చర్యల పర్యవేక్షణ నిమిత్తం ఇద్దరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను వీఆర్‌పురం, కూనవరం మండలాలకు, ఉపాధి ఏపీడీని ఎటపాక మండలానికి నియమించారు. వీరితోపాటు ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరేకు వీఆర్‌పురం, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్‌కు కూనవరం మండలాల బాధ్యతలు అప్పగించారు.
- వరదల అనంతరం గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించేందుకు వివిధ ప్రాంతాల నుంచి 20 వైద్యబృందాలను రప్పించారు. పారిశుధ్య నిర్వహణకు ఇతర ప్రాంతాలకు చెందిన నలుగురు ఎంపీడీవోలతో పాటు 250 మంది సిబ్బందిని నియమించారు.
- ముంపు బారిన పడిన కుటుంబాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.2 వేల చొప్పున ఆర్థికసాయంతో పాటు 25 కేజీల బియ్యం, నిత్యావసరాలు అందజేశారు.

ఆర్థికసాయం వివరాలు

మండలం	గ్రామాలు	కుటుంబాలు	ఆర్థికసాయం (రూ.2వేలు)
వీఆర్‌పురం	76	9,338	1,86,76,000
కూనవరం	48	9,103	1,82,06,000
చింతూరు	33	5,683	1,12,16,000
ఎటపాక	20	2,071	40,42,000
మొత్తం	177	26,195	రూ.5,21,40,000

పంపిణీ చేసిన సరకుల వివరాలు

బియ్యం	: 3,42,900 ఎం.టి.
కందిపప్పు	: 26,674 కేజీలు
వంటనూనె	: 23,274 లీటర్లు
బంగాళాదుంపలు	: 43,000 కేజీలు
ఉల్లి	: 43,000 కేజీలు
దొండ	: 28,000 కేజీలు
క్యాబేజీ	: 1000 కేజీలు
వంగ	: 3,800 కేజీలు
అరటికాయలు	: 6,000
పాలప్యాకెట్లు	: 14,300 లీటర్లు
టార్పాలిన్లు	: 1,080
కొవ్వొత్తులు	: 25,000
అగ్గిపెట్టెలు	: 4,800
కిరోసిన్	: 9,200 లీటర్లు
డీజిల్	: 8,950 లీటర్లు
పెట్రోల్	: 700 లీటర్లు

పర్యటన ఇలా..

సాక్షి, పాడేరు/చింతూరు/కూనవరం: ఇటీవల వరదముంపునకు గురైన కూనవరంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం పర్యటించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- ఉదయం 10.25కు కోతులగుట్ట హెలీప్యాడ్‌కు చేరుకుంటారు.
- 10.30 నుంచి 10.50 వరకు ఇటీవల వరదలకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడతారు.
- 10.55కు కోతులగుట్టలో బయలుదేరి 11.10కు కూనవరం బస్టాండ్ సెంటర్‌కు చేరుకుంటారు.
- 11.10 నుంచి మధ్యాహ్నం 12.40 వరకు కూనవరం, వీఆర్‌పురం మండలాలకు చెందిన వరద బాధిత కుటుంబాలను పరామర్శించి సహాయక చర్యల గురించి అడిగి తెలుసుకుంటారు.
- 12.45కు బయలుదేరి 1.00కు కోతులగుట్ట హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం 1.05కు బయలుదేరి ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం గొమ్ముగూడెం వెళతారు.



ముంపు ప్రాంతాలకు పడవలపై తరలిస్తున్న నిత్యావసరాలు

అప్రమత్తం చేసిన అధికారులు



వరదల సమయంలో ప్రభుత్వం ఎంతో సాయమందించింది. వరద పెరుగుతున్న తరుణంలో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లేలా అధికారులు అప్రమత్తం చేశారు. అక్కడ మేము ఇబ్బందులు పడకుండా నిత్యావసరాలు, కూరగాయలు అందజేశారు.

– బండి రఘు, కుయిగూరు, చింతూరు మండలం

ఆదుకున్న ఆర్థిక సాయం



మా గ్రామం చుట్టూ నీరుచేరడంతో పనులు లేకుండా పోయాయి. ఉపాధి కోల్పోయిన మాకు ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించి రూ. 2 వేల ఆర్థికసాయం అందించింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నందున ఆ నగదు ఎంతగానో ఉపయోగపడింది. – పట్టెల మాణిక్యం, రేఖపల్లి, వీఆర్‌పురం మండలం

సహాయం హర్షణీయం



రెండేళ్లుగా వరదల సమయంలో గత ప్రభుత్వాలకు భిన్నంగా ప్రస్తుత ప్రభుత్వం స్పందించి బాధితులను ఆదుకుంది. ముందుగానే సహాయక చర్యలు చేపట్టడం హర్షణీయం. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపు వల్లే ఇది సాధ్యపడింది. – ఆది సాయిరాం, చొప్పల్లి, వీఆర్‌పురం మండలం

వ్యాధులు ప్రబలకుండా చర్యలు



వరద తగ్గిన అనంతరం ఇళ్ల వద్ద భారీగా చెత్త పేరుకుపోయింది. వ్యాధులు వస్తాయని ఎంతో భయపడ్డాం. కానీ అధికారులు మాత్రం వరద తగ్గిన వెంటనే చెత్తను తొలగించి వీధులన్నీ శుభ్రం చేయించారు.

– బొర్రా నాగమణి, చింతూరు శబరిఒడ్డు



పునరావాస కేంద్రంలో వరద బాధిత కుటుంబాలు

న్యూస్‌రీల్

19న సీలేరు సర్పంచ్ ఉప ఎన్నిక

సీలేరు : సీలేరు మేజర్ పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నిక ఈ నెల 19న నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసిందని డివిజనల్ పంచాయతీ అధికారి పీఎస్ కుమార్, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. సీలేరు సర్పంచ్ కొర్రా పరదేశి ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు.ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల అయింది.ఈనెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 19న పోలింగ్ జరుగుతుందని డివిజనల్ పంచాయతీ అధికారి తెలిపారు.

చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

చింతూరు: విశాఖపట్నం నుంచి భద్రాచలం వెళుతున్న ఆర్టీసీ బస్సు సోమవారం తెల్లవారుజామున మండలంలోని గొల్లగూడెం వద్ద అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్పగాయాలు కాగా సమీపంలోని తులసిపాక పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు.

200 మందికి వైద్య పరీక్షలు



పరీక్షిస్తున్న వైద్యుడు

రంపచోడవరం : రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో స్థానిక రామకృష్ణ మిషన్ వద్ద ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు తలారి వెంకట సుబ్బారావు, దాసరి ఉమా మహేష్, ఎస్. సంపత్‌కుమార్ సేవలందించారు. సుమారు 200 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేసినట్టు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞానందజీ మహారాజ్ తెలిపారు. రోగులకు ఉచిత భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మఠం మేనేజర్ స్వామి రఘువీరానందజీ, క్యాంప్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కూనవరంలో ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ ఉదయ్‌భాస్కర్



కూనవరం బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న టెంట్లు

కూనవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కూనవరం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ ఆదివారం పర్యవేక్షించారు. కోతులగుట్ట వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను కలెక్టర్ పరిశీలించారు. సంబంధిత అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను పరిశీలించారు.

- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ప్రజా ప్రతినిధులు, సీఎంకు స్వాగతం పలికేందుకు ప్రత్యేకంగా వాటర్‌ప్రూఫ్ టెంట్లను ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ హెలిప్యాడ్ ప్రదేశాన్ని, సభాస్థలిని పరిశీలించారు. ఏర్పాట్లపై కలెక్టర్‌తో చర్చించారు. కోతులగుట్ట నుంచి కూనవరం బస్టాండ్ వరకు ఐరన్ పైపులతో బారికేడ్లు ఏర్పాటు చేశారు.
- వరద బాధితులతో సీఎం నేరుగా మాట్లేందుకు బస్టాండ్ ప్రాంగణంలో ప్రత్యేకంగా టెంట్లు వేశారు. వర్షం వచ్చినా అంతరాయం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.
- ఎస్పీ తుహిన్‌సిన్హా పర్యవేక్షణలో హెలిప్యాడ్ నుంచి బస్టాండ్ వరకు సుమారు ఆరు కిలోమీటర్ల మేర పోలీస్ బందోబస్తు, ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశారు. రోప్‌వేతో ట్రైల్ రన్ నిర్వహించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.
- వరద బాధితులతో సీఎం మాట్లాడే అంశాలను లైవ్ ద్వారా ప్రసారం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఐటీడీఏ పీవో సూరజ్ గనోరె, రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభంబన్సల్, ఓఎస్డీ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా సత్యదేవుని సామూహిక వ్రతాలు



ప్రత్యేక అలంకరణలో రమా సత్యనారాయణ స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలు



సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

అడ్డతీగల: సత్యదేవుని సామూహిక ఉచిత వ్రతాలు పవనగిరి క్షేత్రం పర్యవేక్షణలో స్థానిక సాయి సన్నిధి ఫంక్షన్ హాలులో అన్నవరం దేవస్థానం అధికారులు, పురోహితులు నిర్వహించారు. రమాసత్యనారాయణస్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను వేదికపై ఉంచి నూతన వస్త్రాలు, పుష్ప మాలలతో అలంకరించారు. గణపతి పూజ అనంతరం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు. వ్రతాలు అనంతరం భక్తులకు అన్నవరం ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం సూపరింటెండెంట్ పెన్నడ వెంకటేశ్వరావు, ఇన్‌స్పెక్టర్ సంఘం వీర్రాజు, అన్నవరం దేవస్థానం పాలకమండలి సభ్యురాలు కారుకోడి పూజ, పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

చేదోడువాదోడుగా..



మన్యంలో చిన్నారులు పాఠశాలల సెలవురోజుల్లో తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో సాయం చేస్తూ చేదోడువాదోడుగా నిలుస్తుంటారు. ఆదివారం కొయ్యూరు మండలం తోటపేట గ్రామంలో వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన తల్లులకు సాయం చేస్తూ చిన్నారులు ఇలా కనిపించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్

డ్రోన్లతో వ్యవసాయం ఎంతో మేలు

జిల్లా వ్యవసాయాధికారి నందు



వరి నారుమడిని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నందు

చింతూరు: డ్రోన్ల ద్వారా వ్యవసాయం ఎంతో లాభదాయకమని జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నందు సూచించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు సబ్సిడీపై డ్రోన్లు అందచేయనున్నట్లు తెలిపారు. డిగ్రీ చదివిన ఐదుగురు సభ్యుల గ్రూపునకు డ్రోన్ వాడకంపై శిక్షణనిచ్చి వారికి అందజేస్తామన్నారు. డ్రోన్ ఖరీదు రూ.10 లక్షలు కాగా 50 శాతం బ్యాంకురుణం, 40 శాతం రాయితీ, లబ్ధిదారులు పదిశాతం చెల్లించాలన్నారు. ముందుగా లబ్ధిదారుడి వాటా 10 శాతంతోపాటు 40 శాతం రాయితీ మొత్తాన్ని కూడా ముందుగా చెల్లించాలని సూచించారు. నెల అనంతరం రాయితీ మొత్తం లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతాయన్నారు. డ్రోన్ ద్వారా 25 కిలోల బరువు పురుగుమందును త్వరితగతిన పంటలపై పిచికారీ చేయవచ్చన్నారు. జిల్లాలో ముందుగా ఆరు డ్రోన్లు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు ఆయన తెలిపారు. డ్రోన్ నిర్వహణకు లబ్ధిదారులకు తప్పనిసరిగా పాస్‌పోర్టు, సొంతభూమి కలిగి ఉండాలని ఆయన సూచించారు.

పూర్తిస్థాయిలో విత్తనాల పంపిణీ

జిల్లా వ్యాప్తంగా 17,600 క్వింటాళ్ల వరి విత్తనాలు, 650 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు, 500 క్వింటాళ్ల అపరాల విత్తనాలు సరఫరా చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి తెలిపారు. వరదలకు ఎటపాక మండలంలో 360 ఎకరాల్లో పత్తిపంటకు నష్టం జరిగిందని, సంబంధిత రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేందుకు మినుము, పెసర విత్తనాలు అందిస్తామని ఆయన తెలిపారు. అనంతరం ఆయన చింతూరు మండలంలో వరి నారుమళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి రమేష్‌కుమార్, మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాతృత్వపు నీడలో..



ఒకపక్క వ్యవసాయ పనులు చేస్తూ మరోపక్క చంటిబిడ్డలకు పాలిచ్చి లాలిస్తున్న మాతృమూర్తుల దృశ్యాలు మన్యంలో అంతటా కనిపిస్తుంటాయి. ఆదివారం ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతమైన పామురాయి గ్రామ సమీపంలో ఓ మాతృమూర్తి చంటిబిడ్డను గొడుగు నీడన పడుకోబెట్టి వ్యవసాయ పనుల్లో నిమగ్నమై కనిపించింది.

– హుకుంపేట

సండే సందడి



సందడి చేస్తున్న పర్యాటకులు

జి.మాడుగుల: మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కొత్తపల్లి జలపాతాల వద్ద ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొంది. మండలంలో కురుస్తున్న వర్షాలకు గుర్రాయి, అక్కాచెల్లిలగుమ్మి, ఏనుగుగుమ్మి, వంజరి, కొత్తపల్లి జలపాతాలు ఉరకలేస్తున్నాయి. వీటిని తిలకించేందుకు సందర్శకులు ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చారు. ప్రకృతి అందాలను తిలకిస్తూ ఉల్లాసంగా గడిపారు.

వానలు కురవాలంటూ కప్పలకు పెళ్లి

అమ్మిరేఖలలో వేడుకగా నిర్వహణ



పెళ్లి అనంతరం కప్పలు

రాజవొమ్మంగి: వర్షాలు కురవాలంటూ మండలంలోని లోతట్టు గ్రామం అమ్మిరేఖలలో ఆదివారం గిరిజనులు కప్పలకు పెళ్లి చేశారు. అనంతరం వాటిని సమీప కొండ వాగు నీటిలో వదిలిపెట్టారు. తొలకరిలో వర్షాలు కురవడం ఆలస్యం అయితే ఈ విధంగా కప్పలకు పెళ్లి చేయడం ఆచారంగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు. రెండు కప్పలను జోలెలో వేసి ఉపవాసం ఉన్న మగ పిల్లలతో ఊరేగించారు. ఇంటింటికి వెళ్లి బియ్యం, కూరగాయలు, కిరాణా సరుకులు సేకరించారు. అనంతరం సమీప కాలువ వద్దకు వెళ్లి నది ఒడ్డున మట్టితో రెండు కప్పలను చేశారు. అక్కడ వాటికి పసుపు కుంకుమలు అద్ది పూజలు చేశారు. వర్షాలు కురవాలి వానదేవుడా అంటూ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మట్టితో చేసిన కప్పలను, ఊరేగిస్తూ తీసుకువచ్చిన కప్పలను నీటిలో విడిచిపెట్టారు. అనంతరం వెంట తెచ్చుకొన్న దినుసులతో వంటలు చేశారు. తొలుత ఉపవాసంతో ఉన్న పిల్లలకు ఆహారం వడ్డించి ఆ తరువాత గ్రామస్తులు అందరూ కలసి భోజనాలు చేశారు. ఈ పండుగ చేసిన ఒకటి రెండు రోజుల్లో వర్షం కురుస్తుందని వారి నమ్మకం.

రసవత్తరంగా గిరిజన ఉపాధ్యాయ సంఘ ఎన్నికలు

నీలకంఠం ప్యానల్ విజయం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

సాక్షి, పాడేరు: గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘ ఉమ్మడి విశాఖ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక స్థానిక తలారిసింగి పాఠశాల ఆవరణలో ఆదివారం రసవత్తరంగా జరిగింది. అధ్యక్షుడు కంబిడి నీలకంఠం, ప్రధాన కార్యదర్శి మాసాడి శోభన్‌బాబు ప్యానల్‌కు 257 ఓట్లు రాగా, కోడ చిట్టిబాబు, రాంబాబు ప్యానల్‌కు 247 ఓట్లు వచ్చాయి. దీంతో 10 ఓట్ల మెజారీతో కంబిడి నీలకంఠం ప్యానల్ విజయం సాధించింది. ఉపాధ్యక్షులుగా పూజారి ఉపేంద్ర, మోరి మోహన్‌బాబు, పాంగి నందో, రేగం అనిల్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గెమ్మెలి రాజు, మహిళ సెక్రటరీగా జె. శిరీష, మహిళా ఉపాధ్యక్షురాలిగా డి. అచ్చియ్యమ్మ, అసోసియేట్ అధ్యక్షుడిగా కిల్లో భీమరాజు ఎన్నికయ్యారు. వీరంతా ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్య ఎన్నికల అధికారిగా జీవీవీ ప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు పలాసి కృష్ణారావు, ప్రాధానోపాధ్యాయుల అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు రీమలి జాన్, ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు.

క్లుప్తంగా

పర్యాటక ప్రాంతంగా బోడకొండమ్మ ఆలయం

- వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొడ్డేటి మహేష్



నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గొడ్డేటి మహేష్

చింతపల్లి రూరల్: మండలంలో లంబసింగి–నర్సీపట్నం మార్గంలో బోడకొండమ్మ తల్లి ఆలయాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొడ్డేటి మహేష్ అన్నారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో వ్యూ పాయింట్, బాత్‌రూమ్, జలపాతం ఆధునికీకరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ వీటికి అరకు ఎంపీ గొడ్డేటి మాధవి రూ.40 లక్షల ఎంపీ ల్యాండ్స్ నిధులు కేటాయించారన్నారు. పర్యాటకులకు సౌకర్యవంతంగా ఉండేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, సర్పంచ్ శాంతికుమారి, ఉప సర్పంచ్ డేవిడ్ రాజ్, మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి పాల్గొన్నారు.

బస్సు నుంచి జారిపడి వ్యక్తి మృతి



సొంత మృతదేహం

చింతూరు: ప్రమాదవశాత్తు బస్సులో నుంచి జారిపడి ఒడిశాకు చెందిన వ్యక్తి మృతి చెందిన ఘటన చింతూరు మండలం కొత్తూరు వద్ద సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన కుస సొంత(45) అనే వ్యక్తి భద్రాచలం నుంచి ఒడిశా ఆర్టీసీ బస్సులో వెళ్తుండగా, అనారోగ్యంతో ఉన్న అతను ప్రమాదవశాత్తు బస్సులో నుంచి జారిపడ్డాడు. ఈ క్రమంలో అతని తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

చకచకా పనులు

- శరవేగంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు
- జిల్లాలో 130 సెంటర్లకు తీరనున్న భవన సమస్య
- ఒక్కో భవనానికి రూ.13.59లక్షల నిధులు
- మరో రూ.2.50లక్షలతో ఆట సామగ్రి కొనుగోలుకు మంజూరు



కులబీరు అంగన్‌వాడీ కేంద్రంలోని పనులను పరిశీలిస్తున్న అధికారులు

ముంచంగిపుట్టు: గతంలో అంగన్వాడీ కేంద్రాల పరిస్థితిని పట్టించుకునేవారే కరువు అయ్యారు. విరిగిన గచ్చులు, బీటలు వారి ఎప్పుడు కూలిపోతుందో తెలియని గోడలు, రంగులు వెలసిపోయి అధ్వానంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు. ఇది గతంలో పరిస్థితి...వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నాడు–నేడు ద్వారా పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మారిపోయాయి. శిథిలావ్యవస్థలో ఉన్న భవనాలను తొలగించి, కొత్తవి నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. గత ఏడాదిగా నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు జిల్లాలో శరవేగంగా జరుగుతున్నాయి. అల్లూరి జిల్లాలో మొదటి విడుతలో 130 అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నాడు–నేడు ద్వారా ఒక్కో అంగన్‌వాడీ భవనానికి రూ.13.50 లక్షలు మంజూరు చేసింది. దీంతో పాటు సెంటర్‌లలో పిల్లలు ఆడుకునేందుకు మరో రూ.2.50లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో పిల్లల ఆట సామగ్రి, ఆహార పదార్థాలు, పాలు నిల్వ చేసేందుకు ఫ్రిజ్‌లు వంటి ఏర్పాటు చేయనున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లల తల్లులతో కలుపుకొని సచివాలయం, అంగన్‌వాడీ సిబ్బందితో ఒక కమిటీగా ఏర్పడి భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్నారు. నిత్యం వీటి పనుల పురోగతిపై ఐసీడీఎస్ పీడీ స్థాయి అధికారి నుంచి సీడీపీవో, సూపర్ వైజర్ స్థాయి వరకు పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం 130 భవనాల పనులు రూఫ్ లెవెల్ స్థాయికి చేసుకున్నాయి. మరో కొన్ని నెలలో శ్లాబ్ వేసి భవన పనులు శతశాతం పూర్తి చేయనున్నారు. దీంతో ఎన్నో ఏళ్లగా భవనం లేక అవస్థలకు సమస్య తీరనున్నంది.

ప్రత్యేక నిధులు

జిల్లాలో 11 అంగన్‌వాడీ కేంద్రాలకు మరమ్మతుల నిమిత్తం నాడు–నేడు మొదటి విడత ద్వారా ఒక్కో కేంద్రానికి రూ.2.50లక్షల చొప్పున నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. వీటి ద్వారా అంగన్‌వాడీ కేంద్రంలో కిచెన్ షెడ్డు, ప్రహరీ, గదుల మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రెండో విడతలో జిల్లాలో మరో 52 అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.5లక్షల చొప్పున నిధులు విడుదల చేసి ఈ నిధులు వినియోగం కోసం ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది.

సర్వే ఆధారంగా పనులు

వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వం గత ఏడాది సర్వేను నిర్వహించింది. వెల్ఫేర్ అసిస్టెంట్లకు ప్రత్యేక యాప్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో గుర్తించిన సమస్యలను అప్‌లోడ్ చేయించింది. ప్రధానంగా గుర్తించిన సమస్యలను పరిష్కారించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఒక్కో అంగన్వాడీ కేంద్రానికి రూ.5లక్షలను కేటాయించి, మరమ్మతులు, అవసరమయ్యే కేంద్రాలకు కొత్త హంగులు దిద్ది, మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ జరిగేలా కంకణం కట్టుకుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల పిల్లల తల్లిదండ్రులు, బాలింతలు, గర్భిణులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పనులకు కేటాయించిన నిధులు

1. భవనం మరమ్మతుల కోసం 1.80లక్షలు
2. మరుగుదొడ్ల ఏర్పాటుకు రూ.90వేలు
3. రన్నింగ్ వాటర్ కోసం రూ.48 వేలు
4. మరుగుదొడ్ల మరమ్మతుల కోసం రూ.50వేలు
5. ఫ్యాన్‌ల ఏర్పాటుకు రూ.1,813
6. ట్యూబ్ లైట్‌ల ఏర్పాటుకు రూ.501
7. వైరింగ్ కోసం రూ.10 వేలు
8. పెయింటింగ్ కోసం రూ.25 వేలు

అనుమతులతోనే నిధుల ఖర్చు



జిల్లాలో 130 అంగన్వాడీ కేంద్రాలకు నూతన భవనాలు మంజూరుయ్యాయి. వీటి నిర్మాణ పనులు 96 శాతం పూర్తయ్యాయి. భవనాల మరమ్మతుల కోసం మొదటి విడతలో–11, రెండవ విడతలో–52 అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. నిధుల ఖర్చు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. హెచ్‌ఎం, విద్యా కమిటీ చైర్మన్, ఇద్దరు సభ్యులు, ఎడ్యుకేషన్ అసిస్టెంట్, ఇంజినీర్ ఉమ్మడి అకౌంట్‌లో నిధులు జమ చేశారు. అందరి పూర్తి అనుమతులతో పనుల ప్రగతి ప్రకారం నిధుల ఖర్చు చేస్తున్నారు.

– ఎన్.సూర్యలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ, అల్లూరి జిల్లా

విహారంలో ప్రమాదం

- బ్రిడ్జిని ఢీకొట్టిన కారు
- కాలువలో పడి ఇద్దరి మహిళలకు తీవ్ర గాయాలు

మారేడుమిల్లి : విహారంలో చోటుచేసుకున్న ప్రమాదంలో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన నలుగురు కుటుంబ సభ్యులు రెండు బైకులపై విహారయాత్రలో భాగంగా మారేడుమిల్లి వచ్చారు. ఆదివారం వీరు తిరిగి బయలుదేరారు. ఇదే మార్గంలో మారేడుమిల్లికి సమీపంలోని మాటుమామిడి బ్రిడ్జి వద్ద ఆగారు. వీరిలో ఇద్దరు మహిళలు పింకి, లక్ష్మి బ్రిడ్జిపై నిలబడి ఫొటోలు తీసుకుంటున్నారు. ఇదే సమయంలో బ్రిడ్జిని కారు ఢీ కొట్టడంతో వారిద్దరు కాలువలో పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108లో రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే కారుకు సంబంధించిన వారు అక్కడి నుంచి పరారయ్యారు.

బి.ఎస్.రెడ్డికి విశాఖ మ్యాజిక్ డైమండ్ బిరుదు

దాబాగార్డెన్స్: అంతర్జాతీయ మెజీషియన్, ఆస్కార్ అఫ్ మ్యాజిక్ అవార్డు గ్రహీత, విశాఖ వాసి బి.ఎస్.రెడ్డికి 'విశాఖ మ్యాజిక్ డైమండ్' బిరుదును వాకర్స్ క్లబ్ బహూకరించింది. నగరంలోని ఓ హోటల్లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బీఎస్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బి.ఎస్.రెడ్డి నిర్వహించిన ఇంద్రజాల ప్రదర్శన ఆకట్టుకుంది. విశాఖ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కె.సత్తిరాజు, కార్యదర్శి వేద మధుసూదన్, కోశాధికారి వీసీహెచ్‌వీఆర్ గుప్తా, ఏఎస్ఎన్ ప్రసాద్, ఏహెచ్ఎన్ వెంకట్రావు, బొడ్డు రఘు, డాక్టర్ మద్దుల రాంజీ, దుర్గా సోమేశ్వరరావు, పూసర్ల సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'అమృత్ భారత్'తో దువ్వాడ స్టేషన్‌కు మహర్దశ

- రూ.26కోట్లతో అభివృద్ధి, అత్యాధునిక వసతుల కల్పన
- ఎంపీలు ఎంవీవీ, జీవీఎల్



దువ్వాడ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీలు ఎంవీవీ జీవీఎల్, మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి

అగనంపూడి: అమృత్ భారత్ కార్యక్రమంతో దువ్వాడ రైల్వేస్టేషన్ దశ మారనుందని ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, జీవీఎల్ నరసింహారావు అన్నారు. అమృత్ భారత్‌లో భాగంగా దువ్వాడ రైల్వేస్టేషన్‌తో పాటు దేశ వ్యాప్తంగా 508 రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధికి ఆదివారం ప్రధాని మోదీ వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా దువ్వాడ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీలు మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంతో ముడిపడి ఉన్న దువ్వాడ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తుండటం సంతోషంగా ఉందన్నారు. వాల్తేరు డివిజన్ పరిధిలో కొత్త లైన్లు ఏర్పాటు చేయడానికి రూ.400 కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ దువ్వాడ రైల్వేస్టేషన్‌ను ఎప్పుడో అభివృద్ధి చేయాల్సిందని.. అమృత్‌భారత్‌లో దువ్వాడను ఎంపిక చేసి, అభివృద్ధి చేస్తుండటం ఆనందంగా ఉందన్నారు. స్టేషన్‌ను విస్తరించడంతో పాటు అన్ని రైళ్లు నిలుపుదల చేయాలని కోరారు. డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ దువ్వాడ రైల్వేస్టేషన్‌ను అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దుతామన్నారు. అమృత్ భారత్‌పై నగరంలోని వివిధ పాఠశాలల్లో నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల విజేతలకు ఈ సందర్భంగా అతిథులు బహుమతులు అందించారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, ఎమ్మెల్సీ డి.రామారావు, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, విష్ణుకుమార్‌రాజు, బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కె.ఈశ్వర్, కె.చంద్రరావు, మాటూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం



శరభగుడలో నినాదాలు చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

అరకులోయ టౌన్: మండలంలోని శరభగుడలో ఆదివారం ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల ఒకటో తేదీ నుంచి 9వ తేదీ వరకు ఆదివాసీ హక్కుల దినోత్సవం నిర్వహించాలని ఆదివాసీ గిరిజన సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆదివాసీ సంఘ మండల నాయకుడు కె. మగ్గన్న అధ్యక్షతన ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకుని ఆదివాసీ గిరిజన సంఘం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. ఈ సందర్భంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కిల్లో సహదేవ్, పి. రాము, కేశవ, మహాదేవ్, కార్తీక్ సాయి, విష్ణు, కల్యాణ్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



మర్రిగూడెంలో పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబా

కూనవరం: మండలంలో వివిధ పార్టీలకు చెందిన మర్రిగూడెం పంచాయతీ పరిధిలో 50 కుటుంబాలు, వెంకటాయపాలెం సచివాలయం పరిధిలో 20 కుటుంబాలు, టేకుబాక పంచాయతీలో ఐదు కుటుంబాలు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి పార్టీ కండువాలు వేసి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(బాబు) పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఆవుల మరియాదాస్, ఆరెకటిక రాష్ట్ర డైరెక్టర్లు డి.గంగాధర్, ఎ. వెంకటరామారావు, ఇంటి పూర్ణానందం, ఎస్ సత్యనారాయణ, మండల కన్వీనర్ ఆలూరి కోటేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ గుజ్జాబాబు, ఎంపీటీసీ మడకం నాగరాణి, సర్పంచ్ నిరోషా పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



పాలకొండ గ్రామంలో వరినాట్లను పరిశీలిస్తున్న మేఘాలయ విద్యార్థి బృందం

మన్యంలో మేఘాలయ విద్యార్థి బృందం పర్యటన

జి.మాడుగుల: రాష్ట్రంలో రైతు సాధికార సంస్థ అమలు పరుస్తున్న ప్రకృతి వ్యవసాయం అమలు పాటించే పద్ధతులపై డీపీఎంయూ తరుణ్, ఎస్ఎఫ్ఏఆర్ వర్మ, రైతు సాధికార సంస్థ సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం మేఘాలయ విద్యార్థి బృందానికి అవగాహన కార్యక్రమం జరిగింది. స్వయం సహాయక సంఘాలతో కలసి సమావేశాలు, భూసర్వే, పంటల వారీ విధానం, మన్యంలో పండిస్తున్న పంటలు , ఇన్ పుట్స్ తయారీ, కషాయాలు తయారీ బీజ, ఘన,ద్రవ అమృతాలు తయారీలపై శిక్షణ నిచ్చారు. ప్రకృతి వ్యవసాయంలో పాటించే పద్ధతులను రైతుల ద్వారా మేఘాలయ విద్యార్థి బృందం తెలుసుకున్నారు. ఏజెన్సీలో వాణిజ్య పంటల సాగుపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఆదాయం, ఆశాజనకంగా పంటల దిగుబడి కలుగుతోందని, భూసారం మెరుగుపడుతుందని పలువురు వివరించారు. మేఘాలయ విద్యార్థులు మాట్లాడుతూ తమ రాష్ట్రంలో కూడా ఇదే వ్యవసాయం పద్ధతులు పాటించే విధంగా వ్యవసాయ అధికారులకు తెలియజేసి వ్యవసాయాభివృద్ధి సాధిస్తామన్నారు. కార్యక్రమంలో నిట్టాపుట్టు ఎఫ్‌పీవో మేనేజర్ గంగరాజు, ప్రకృతి వ్యవసాయ విభాగ సాధికారం సంస్థ మండల ఇన్‌చార్జి జె.వెంకట్, యూనిట్ ఇన్‌చార్జీలులు ప్రసాద్, రామలింగం, మహేశ్వరి, పాపారావు, ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమం

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

సీలేరు: పారదర్శకంగా, పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమాన్ని ప్రభుత్వం అందిస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. సీలేరులో ఆమె ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారన్నారు. పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలుచేసి, వారి అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పరిచారన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి జగనన్న ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమన్నారు. ఇప్పటి నుంచే ఎన్నికలకు పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ప్రతీ మండలానికి ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.2 కోట్లతో రోడ్లు ,డ్రైనేజిలు నిర్మిస్తున్నామన్నారు. రూ.4 కోట్లతో సప్పర్ల ఘాట్ రోడ్డు పనులు కూడా త్వరలో ప్రారంభిస్తామన్నారు. జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, ఎంపీపీ కుమారి, ఎంపీటీసీ సభ్యుడు సాంబమూర్తి, నాయకులు గణేష్ ,బుజ్జి, వెంకట్రావు తదితరులున్నారు.

విశాఖపై ఎనలేని ప్రేమ



- ఇక్కడ అందాలంటే అంతులేని మోజు
- బీచ్‌లో గడపడానికి ఎంతో ఆసక్తి
- చేపల కూరంటే చెప్పలేనంత ఇష్టం
- ఉక్కు ప్రైవేటీకరణపై ఉత్తేజపరిచే పాటలు
- ప్రజాకవి వంగపండును బావగా సంభోదన
- వైజాగ్‌తో గద్దర్‌కు విడదీయరాని బంధం

సాక్షి, విశాఖపట్నం: విశాఖతో ప్రజా గాయకుడు గద్దర్‌కు ఎంతో అనుబంధం ఉంది. ఇక్కడ ప్రకృతి రమణీయతకు ఎంతో ముగ్ధులయ్యే వారు. విశాఖ వచ్చినప్పుడల్లా బీచ్‌లోనే ఎక్కువ సమయం గడపడానికి ఆసక్తి చూపేవారు. అలల అందాన్ని తనివితీరా ఆస్వాదించేవారు. వైజాగ్‌లాగే ఇక్కడ ప్రజలు ఎంతో ప్రశాంతంగా ఉంటారని తరచూ కొనియాడేవారు. విశాఖ ప్రశాంతత చూస్తే కవిత్వం, ఉద్వేగం కలగలిసి ఉప్పొంగుతుందని తన స్నేహితులు, ఆత్మీయులతో చెప్పేవారు. విశాఖలో దొరికే తాజా చేపలతో వండే కూరంటే ఆయనకు ఎంతో ఇష్టం. అందుకే విశాఖ వచ్చినప్పుడు తాను బావగా పిలుచుకునే ప్రజాకవి వంగపండు ప్రసాదరావు ఇంట్లో తనకిష్టమైన చేపలకూరను వండించుకుని తినేవారు. ఎంతో నిరాడంబర జీవితాన్ని గడిపే గద్దర్.. వైజాగ్ వస్తే హోటళ్లలో గడపడానికి ఇష్టపడేవారు కాదు. ఎవరైనా ఆయనకు హోటళ్లలో గది బుక్ చేస్తామన్నా వద్దని, తన ప్రియమైన బావ (వంగపండు) ఇంట్లోనే ఉంటానని చెప్పేవారు. ఇక విశాఖ వచ్చినప్పుడు వంగపండుతో కలిసి గజ్జె కట్టి పాటలు పాడే వారు. తాను ఎక్కువగా వంగపండు రాసిన పాటలనే పాడతానని గద్దర్ చెప్పేవారు. 2020 ఆగస్టు 4న వంగపండు కన్నుమూయగా.. సరిగ్గా మూడేళ్ల రెండు రోజుల తర్వాత గద్దర్ తన బావ చెంతకే చేరడం యాదృచ్ఛికం!

సమ్మె నీ జన్మ హక్కురన్నో..

ఇక కార్మికుల పక్షాన పాటల రూపంలో ఉద్యమ స్ఫూర్తినిచ్చే గద్దర్ విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ యత్నాలపై కూడా చూస్తూ ఊరుకోలేదు. ప్రైవేటీకరణకు నిరసనగా గళమెత్తడమే కాదు.. 'ఉక్కు సత్యాగ్రహం'పేరుతో నిర్మిస్తున్న సినిమాలో నటించడానికి విశాఖ వచ్చారు. సొంతంగా పాటలు రాసి.. పాడారు.

'అన్నన్న మాయన్న కంపెనీ కూలన్న..
ఎన్నాళ్లు ఈ బతుకు.. ఎదురు తిరగవన్నో..
సమ్మె నీ జన్మ హక్కురన్నో..
దాని ఆపె మొనగాడెవ్వడన్న
ఉక్కు ఫ్యాక్టరీ తల్లి దుఃఖంలో మునిగింది..
విశాఖ సంద్రము శోకమై పొంగింది..
అమరుల త్యాగాలు.. విశాఖ ఉక్కు ఫలాలు..
నెత్తూరు చుక్కలు ఎరుపు.. మన స్టీలుపై మెరిసేటి మెరుపు..
ప్రైవేటు వాడికి ఫ్యాక్టరీ పొతరేస్తే..
ఉన్న కొలువు ఊడి అన్నమో సున్నము..!'

అంటూ గొంతెత్తారు. ఈ సినిమా మరికొద్దిరోజుల్లో విడుదల కానున్న తరుణంలో గద్దర్ కన్నుమూయడాన్ని విశాఖ వాసులు, ముఖ్యంగా ఉక్కు కార్మికులు జీర్ణించుకోలేకపోతున్నారు. కాగా.. ఉక్కు ఉద్యమం 900 రోజుకు చేరిన సందర్భంగా జూలై 31 ఆయన విశాఖకు రావాల్సి ఉంది. అయితే ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఈ పర్యటనను రద్దు చేసుకున్నారు. ఆరోగ్యం కుదుటపడ్డాక వస్తానని చెప్పినట్లు ఉక్కు పోరాట కమిటీ నాయకులు తెలిపారు.

గద్దర్ గళం.. అజరామరం

విశాఖలో చివరి జ్ఞాపకం

కొమ్మాది/ఏయూక్యాంపస్/దాబాగార్డెన్స్/మద్దిలపాలెం/జగదాంబ: దర్శక నిర్మాత పి.సత్యారెడ్డి తెరకెక్కిస్తున్న ఉక్కు సత్యాగ్రహం సినిమాలో నటించేందుకు చివరిగా ఆయన విశాఖ వచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో విప్లవ స్ఫూర్తి నింపే ఓ పాటలో ఆయనపై కైలాసగిరి, మంగమారిపేట బీచ్, ఆర్.కె.బీచ్, రామానాయుడు ఫిల్మ్ స్టూడియోలో పలు సన్నివేశాలు చిత్రీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం తనను ఎంతగానో బాధించిందన్నారు. ఎందరో మహానుభావుల ప్రాణత్యాగాలతో ఏర్పడిన స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించడం తగదన్నారు. ఆయన అకాల మరణం ఎంతో బాధించిందని నటుడు ప్రసన్న కుమార్, ఉక్కు సత్యాగ్రహం సినిమా దర్శక, నిర్మాత పి.సత్యారెడ్డి, ప్రొడక్షన్ మేనేజర్ బి.రాము అన్నారు.

ఏయూతో అనుబంధం

ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు, ఆచార్యులతో గద్దర్‌కు మంచి అనుబంధం ఉండేది. 1990లో ఏయూ ఆరుబయలు రంగస్థలం(ఓపెన్ ఎయిర్ థియేటర్) వేదికగా జరిగిన కాలేజ్ డే లో ఆయన పాల్గొని పలు గేయాలను ఆలపించారు. ఇదే వేదికపై చలసాని ప్రసాద్ కుమార్తె నవత సైతం పలు గీతాలను ఆలపించారు. ఆచార్యులతో ఆయనకు ఆత్మీయ అనుబంధం ఉండేదని ఏయూ జర్నలిజం విభాగం పూర్వ ఆచార్యులు పి.బాబీవర్ధన్ గుర్తు చేసుకున్నారు. రామాటాకీస్ వద్ద ఉన్న అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన అమరవీరుల స్మరణ సభలో కూడా గద్దర్ పాల్గొన్నారు.

తెలుగుజాతి ఐక్యం కావాలి

భౌగోళికంగా విడిపోయిన తెలుగుజాతిని ఐక్యం చేసేందుకు సాంస్కృతిక తెలుగు సేన, వైజాగ్ జర్నలిస్టుల ఫోరం సంయుక్తంగా ఈ ఏడాది జనవరిలో వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో గద్దర్ మాట్లాడారు. కులాల వారీగా విడిపోతున్న తరుణంలో తెలుగు వారు ఎక్కడ ఉన్నా ఒక జాతిగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అమ్మా నీకు వందనం.. ఓ తెలుగు తల్లి నీకు వందనమంటూ గద్దర్ తన గళం వినిపించారు.